క్లుప్తంగా

అంగన్‌వాడీలు తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న సీడీపీఓ శశికళ

చిన్నమండెం : మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను రాయచోటి డీసీపీఓ శశికళ తనిఖీలు చేశారు. గురువారం ఆమె మండల పరిధిలోని రెడ్డివారిపల్లె, రెడ్డివారిపల్లె అరుంధతివాడ, సి–దూలపల్లె సెంటర్లను తనిఖీ చేశారు. సెంటర్లను పరిశుభ్రంగా ఉంచాలని, స్టాక్ నిర్వహణ, రిజిస్టర్స్ పక్కాగా ఉండాలని వివరించారు. మెనూ ప్రకారం భోజనం అందించకుంటే చర్యలు తీసుకుంటామని అంగన్వాడీ సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సుగుణమ్మ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మట్టి గణపతులను అందజేస్తున్న మల్లికార్జునరెడ్డి

నందలూరు : పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. మట్టి వినాయకుడినే పూజిద్దాం అని చాటుతూ బుధవారం నాగిరెడ్డిపల్లి గ్రామంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదురుగా రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ జిల్లా ప్రచార కార్యదర్శి గుండు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో పర్యావరణ స్పృహ కలిగించాలన్నదే తన ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, శైల కుమార్, ముమ్మడిశెట్టి సుధాకర్, శర్మ, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఉట్టిపోటీల విజేత సోమశేఖర్



ఉత్సాహంగా ఉట్టి కొడుతున్న చిన్నారులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ ఎన్‌టీఆర్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహం వద్ద గురువారం సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమంలో రేగిమడుగు సోమశేఖర్ విజేతగా నిలిచి 20 గ్రాముల వెండి బహుమతిని కైవసం చేసుకున్నారు. అలానే పంచాయతీ పరిధిలో వినాయక విగ్రహాలకు రెండవ రోజు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అన్నదానం గొప్పది



ఏఎస్పీని సన్మానిస్తున్న నిర్వాహకులు

రాయచోటి టౌన్ : అన్నదానం చాలా గొప్పదని అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో ఉన్న వైఎస్సార్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఏఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని వినాయకుడికి పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదం పంచి పెట్టారు. ఏఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావాలను అలవర్చుకోవాలని చెప్పారు. అలాగే ఇలాంటి ఉత్సవాలు మతాలకు అతీతంగా అందరూ కలసి మెలసి నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం నిర్వాహకులు అడిషనల్ ఎస్పీని దుశ్శాలువా, పూల మాలతో సన్మానించి వినాయకుడి చిత్రపటాన్ని అందజేశారు.

ప్రాంతీయాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

రాజంపేట : రాజంపేట ప్రాంతీయాభివృద్ధికి ఎప్పటికీ, ఎన్నటికీ అన్నమాచార్య యూనివర్సిటీ కట్టుబడివుందని గురువారం ఏయూ యాజమాన్యం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. రాజంపేటను జిల్లా ప్రధాన కేంద్రంగా ప్రకటించాలనే ప్రతిపాదనను ఏయూ హర్షణీయంగా స్వాగతిస్తోందని చెప్పారు. ఈ నిర్ణయం అమలు కావడం ద్వారా రాజంపేట ప్రజల ఎన్నో దశాబ్దాల కల నెరవేరుతుంది. ఏయూ ఈ ప్రక్రియను ఎప్పుడు వ్యతిరకంగా లేదన్నారు. ఎల్లప్పుడూ అభివృద్ధి పట్ల సానుకూల దృక్పథంతోనే ముందడుగు వేసిందన్నారు. 2022 ఫిబ్రవరి 8న అన్నమాచార్య యూనవర్సిటీ యాజమాన్యం జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా వినతి పత్రం సమర్పించింది. ఇప్పుడు కొత్త జిల్లాల రూపకల్పనలో రాజంపేటకు ప్రధాన కేంద్రం దక్కడం విశ్వవిద్యాలయానికి గర్వకారణం. ఏయూ ఎప్పుడు విద్యాప్రగతి, పరిశోధన, సామాజిక బాధ్యతలతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి కట్టుబడి ఉంది. అన్నమాచార్య యూనవర్సిటీ తరపున రాజంపేట జిల్లా స్థాపనకు సంపూర్ణ మద్దతు కొనసాగుతుంది. భవిష్యత్తులోనూ విద్యా, సామాజిక, ఆర్థిక రంగాలలో కలిసి ముందుకు సాగేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంగా తెలియచేస్తున్నాం.


ఆహ్లాదాన్ని పంచేలా.. ఆధ్యాత్మికతను పెంచేలా


- ప్రకృతిసోయగాల నడుమ వెలసిన ఉమామహేశ్వరుడు
- గుత్తేదారుల తీరుపై గుట్టకు ప్రమాదమంటున్న స్థానికులు



శివగిరి క్షేత్రంలో ఉమామహేశ్వరస్వామి ఆలయం, పూజలందుకున్న శివలింగం(ఇన్‌సెట్)

గాలివీడు : ఓ వైపు పచ్చని ప్రకృతి అందాలు, మరో వైపు వివిధ ఆకృతులను పోలిన కొండరాళ్లు.. వీటి మధ్య చిన్న గుహలాంటి మందిరంలో నీలకంఠుడు కొలువుదీరాడు. ఇవన్నీ చూడలాంటే పేరాలగుట్టకు వెళ్లాల్సిందే. ఈ ఆలయం దశాబ్దాల కాలంగా ఆధ్యాత్మిక కేంద్రంగా పరిఢవిల్లుతోంది. దట్టమైన చెట్ల మధ్య పక్షుల కిలకిలరావాలు, చుట్టూ గుట్టలు ఇలా ప్రకృతి సోయగాల నడుమ వెలసిన ఈ ఆలయ పరిసరాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అటు భక్తుల్ని, ఇటు ప్రకృతి ప్రేమికులను ఆహ్వానించే అబ్బురపరిచే ఆలయం గాలివీడు పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరం కుమ్మరపల్లె వద్ద గల పేరాలగుట్టలో ఎత్తయిన కొండల నడుమ కనిపిస్తుంది. కొండలో ఉత్తర అంచున ఉండే అతి పురాతనమైన ఈ ఆలయాన్ని కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించినట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ వున్న లింగం స్వయంభువుగా వెలసిందని, దీన్ని గమనించిన కొందరూ పశువుల కాపర్లు ఇచ్చిన సమాచారంతో స్వామి వారికి ఒక ఆలయాన్ని నిర్మించినట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఈ ఆలయాన్ని చేరుకునేందుకు కొంత దూరం కొండ మార్గంలో నడిచి వెళితే భక్తులకు అక్క దేవతలు, నందీశ్వరుడు, పరమేశ్వరుడిని దర్శించుకోవచ్చు. ఏటా మాఘ అమావాస్య, శివరాత్రి పర్వదినాల్లో భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకుంటారు. స్వామి వారి మహిమలతో ఆరోగ్య సమస్యలు, ఉద్యోగ, వ్యాపార, సంతాన సమస్యలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అంతేగాక ఇక్కడే మరో పెద్ద గుహవద్ద బండరాళ్లకు అనుసంధానంగా సాంబ్రాణి కలిగిన రాయి అందరితో స్వామి వారి అభిషేకం, ధూపం వేసేవారని శివయ్య భక్తులు చెబుతున్నారు. కొండపైన ఎప్పుడూ నిల్వ ఉన్న నీటి దొన(నీటి గుంట) ఉండేదని అయితే కాలక్రమేనా గుణాది రాళ్ల చీల్చేందుకు వేలంపాట పాడుకున్న గుత్తేదారుల నిర్వాకంతో గుట్ట కనుమరుగైందని స్థానికులు చెబుతున్నారు. అంతేగాక గుత్తేదారులు కొండను చీల్చే క్రమంలో నాట్లు పెట్టి పేలుస్తున్నారు. దీంతో ఆలయం చుట్టుపక్కల ప్రాంతం పూర్తిగా దెబ్బతిని ఆలయం నామరూపాలు లేకుండా పోతుందేమోనని భక్తులు సందేహిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతి పురాతనమైన ఆలయాలు ధ్వంసం కాకుండా పరిరక్షించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





ఆలయం చుట్టూ భక్తులను ఆకర్శిస్తున్న ప్రకృతి రమణీయ దృశ్యాలు

రోడ్డుపైకి పశువులు రాకూడదు



పశువుల యజమానులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ కుళ్లాయప్ప

రాయచోటి టౌన్ : పశువులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఆ పశువుల యజమానులపై చర్యలు తీసుకుంటామని రాయచోటి ట్రాఫిక్ సీఐ ఎస్.కుళ్లాయప్ప యజమానులకు సూచించారు. గురువారం రాయచోటి మార్కెట్ యార్డులో మున్సిపల్ శాఖ అధికారులతో కలసి ఆవులు, ఎద్దు యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు వెంట అడ్డదిడ్డంగా ఆవులు, ఎద్లు సంచరించడంతో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని తెలిపారు. ప్రమాదాలు నియంత్రించాలంటే రోడ్డుపైకి పశువులు రానీయకుండా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందని చెప్పారు. ఎక్కడైనా రోడ్డుపై వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలిగించినా, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించినా, ప్రమాదాలకు గురిచేసినా ఇకపై యజమానులపై చర్యలు తీసుకొంటామన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాసులు

రాయచోటి టౌన్ : మామిడి తోటలలో యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని కలికిరి ఉద్యాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఏ. శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం రాయచోటి పరిధిలోని మాధవరం, కాటిమాయకుంట గ్రామాలలో మామిడి తోటలలో కాయల కోత పూర్తయిన తరువాత తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై సూచనలు అందించారు. కోత పూర్తి అయిన తరువాత 15 – 20 రోజులు పూర్తిగా విశ్రాంతిని ఇచ్చిన తరువాత అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను, కిందకు వేలాడుతున్న కొమ్మలను కత్తిరించాలని, అలాగే ఎండు పుల్లలను కూడా తొలిగించాలని చెప్పారు. ఇలా చేయడం వలన వెలుతురు, సూర్యరశ్మి కావాల్సినంత లభిస్తుందన్నారు. అలాగే కొమ్మలు కత్తిరించిన భాగాలకు బోర్డుపేస్ట్ మిశ్రమాన్ని పూయాలని తెలియజేశారు. కార్యక్రమంలో రాయచోటి ఉద్యానశాఖ అధికారి జి.సురేష్ బాబు, రైతు సేవా కేంద్రం సిబ్బంది రమణారెడ్డి, శివరాణి, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

యూరియాను మోతాదుకు మించి వాడరాదు

రాజంపేట రూరల్ : రైతులు వ్యవసాయం చేసే సమయంలో పంటకు తగినంత మాత్రమే యూరియాను వినియోగించాలి మోతాదుకు మించి వాడితే పంటకు నష్టం వాటిల్లుతుందని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శివశంకర్ తెలియజేశారు. మండల పరిధిలోని తాళ్లపాక గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ శివశంకర్ వరి పొలాలను పరిశీలించారు. అదే విధంగా అక్కడి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పంటకు తగినంత మోతాదులో ఎరువులు వాడాలన్నారు. సాగు చేయటంలో ఎటువంటి అనుమానాలు తలెత్తినా మీగ్రామ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. సాగులో మెలకువలను పాటించాలన్నారు. వ్యవసాయం లాభసాటి కావాలంటే సాగుకు తగినంతగా ఎరువుల వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.నాగలక్ష్మి, తాళ్లపాక విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.ప్రియాంకతో పాటు ఆత్మ బీటీఎం ఓబీ సుబ్రమణ్యం కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



గాలివీడు:ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారి బాబు



ఓబులవారిపల్లె: ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న విజిలెన్సు అధికారులు

గాలివీడు : ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారి బాబు, మండల వ్యవసాయ అధికారి గౌతమి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను వారు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక రేట్లకు అమ్మకాలు జరిపితే ఇబ్బందులు తప్పవన్నారు. వ్యాపారులు రైతుల అవసరాలను గుర్తించి ఎలాంటి కొరత లేకుండా ఎరువులను అందజేయాలన్నారు. కాదని ఇష్టా అమ్మకాలు చేస్తే చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రతి కొనుగోలుకు తప్పకుండా రసీదును అడిగి తీసుకోవాలని రైతులను కోరారు. నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మినవారిపై చర్యలు తీసుకోవడంతో పాటు దుకాణం సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనుమతి ఉన్న గోడౌన్‌లలో ఉన్న స్టాకును ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, స్టాకు బోర్డ్‌లో రైతులకు తెలిసేలా అమర్చాలని తెలిపారు.

ఓబులవారిపల్లె: యూరియాను ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని విజిలెన్సు అధికారులు మురళీ కృష్ణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ప్రైవేటు ఎరువుల దుకాణాలను విజిలెన్సు అధికారులు, వ్యవసాయ అధికారులు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్సు అధికారి మాట్లాడుతూ రైతులకు తమపంట పొలాలకు కావాల్సినంత ఎరువులను సరఫరా చేసే నిల్వలు ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఎరువుల దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి మల్లిక తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



నిమజ్జనం కోసం సిద్దవటం హైలెవల్ వంతెన వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దవటం : వినాయక చవితి పండుగ సందర్భంగా సిద్దవటం, ఒంటిమిట్ట, చిన్నచౌక్, బద్వేల్ గ్రామాలలో ఏర్పాటు చేసిన విగ్రహాలను సిద్దవటం హైలెవల్ వంతెన వద్ద నిమజ్జనం చేసే విధంగా అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మండల ఎస్ఐ మహ్మద్ రఫీ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలలో భాగంగా సిద్దవటం మండలంలో 110 వినాయకుని విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చామని, శుక్ర, శని, ఆది, సోమ, మంగళ వారాల్లో ఐదురోజుల నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామని, నిమజ్జనానికి రెండు భారీ క్రేన్లు, జేసీబీ యంత్రాలు సహాయంతో నిమజ్జన ప్రక్రియను చేపట్టనున్నట్టు తెలియజేశారు. మండల అధికారుల సమష్టి కృషితో పనులు జరుగుతున్నాయని చెప్పారు. భాకరాపేట, మాధవరం, ఒంటిమిట్ట, కడప నుంచి వచ్చే వినాయకుని విగ్రహాలను మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు నిలుపుదల చేసి వివరాలు సేకరించిన తరువాత నిమజ్జనానికి పంపిస్తామన్నారు. బద్వేల్ వైపు నుంచి వచ్చే వినాయకుని విగ్రహాలను బీసీ బాలికల హాస్టల్ వద్ద నిలుపుదల చేసి పూర్తి సమాచారం వివరాలు సేకరించి నిమజ్జనానికి పంపిస్తామని, రాత్రి వేళల్లో నిమజ్జనం జరిగే విధంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

సీఎంఓ గ్రీవెన్స్‌కు తప్పుడు సమాచారం

పీలేరు రూరల్ : సీఎంఓ గ్రీవెన్స్‌కు పీలేరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తప్పుడు సమాచారం ఇచ్చారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ తెలిపారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడుతూ మే నెల 11న అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని పీలేరు పోలీసులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు తెలియకుండా వదిలేశారని ఆరోపించారు. ఈ సంఘటనపై ప్రశ్నించినందుకు తనపై అక్రమ కేసు బనాయించారని తెలిపారు. ఈ సంఘటనలపై జిల్లా కలెక్టర్‌కు, పౌరసరఫరాలశాఖ మేనేజింగ్ డైరెక్టర్, రాష్ట్ర మంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జిల్లా అధికారులకు విచారణ జరపాలని ఆదేశాలు వచ్చినా, ఎటువంటి విచారణ జరపకుండా, సీఐకే విచారణ అధికారిగా ఇచ్చారన్నారు. తప్పుచేసిన అధికారే విచారణ జరిపినట్లు సీఎంవోకు తప్పుడు నివేదిక ఇచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో సుధాకర్ బాబు, నరసింహులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించేదాకా పోరాటం



రాయచోటి జగదాంబ సెంటర్: అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు



రాజంపేట రూరల్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు



ఓబులవారిపల్లె: కలసికట్టుగా పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యుత్ చార్జీలు పెంచబోమని అధికారంలోకి వచ్చి ఇప్పుడు కూటమి ప్రభుత్వం మాట తప్పిందని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. 2000 ఆగస్టు 28న విద్యుత్ చార్జీలు తగ్గించాలని బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారి పోరాట స్ఫూర్తితో నేడు కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని పోరాడతామని గురువారం సీపీఐ ఆధ్వర్యంలో కోర్టు పక్కన ఉన్న అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని పైగా ట్రూడౌన్ పేరుతో ధరలు తగ్గిస్తామని ప్రకటించి మరలా ట్రూఅప్ పేరుతో మరో రూ.12,771 కోట్ల భారాన్ని మోపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, చార్జీల పెంపుదలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, అంబేడ్కర్ సేన నాయకులు పల్లెం తాతయ్య, పౌరహక్కుల సంఘం నాయకులు రెడ్డన్న, సాంబశివ, వంగిమల్ల రంగారెడ్డి, సుధీర్, పి.కోటేశ్వరరావు, హరినాథనాయుడు, అంజద్‌ఖాన్, ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ అమరులకు నివాళి

ఓబులవారిపల్లె : నాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో బషీర్‌బాగ్‌లో నిరసనకారులపై కాల్పులు జరపడంతో ముగ్గురు అమరులయ్యారు. వారికి గురువారం మంగంపేట ఏపీఎండీసీ ప్రాంగణంలో ఏఐటీయూసీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మాధరాజు గంగాధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక ప్రజలపై విద్యుత్ భారం మోపుతూ తీసుకున్న చర్యలు, స్మార్ట్ మీటర్ల సర్దుబాటు చార్జీలు వ్యతిరేకంగా ఏఐటీయూసీ తరపున పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో త్రివేణి ఏపీఎండీసీ కార్మిక సంఘం నాయకులు వరప్రసాద్, సూరిబాబు, కార్మికులు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమం

రాజంపేట రూరల్ : 2000 సంవత్సరంలో బషీర్‌బాగ్‌లో నిర్వహించిన ఉద్యమం స్ఫూర్తితో నేటి కూటమి ప్రభుత్వం పాలనను నిరసిస్తూ మరో విద్యుత్ ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్, సీపీఎం జిల్లా నాయకులు సి.రవికుమార్‌లు తెలియజేశారు. జాతీయ రహదారి పైనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బషీర్‌బాగ్ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు గురువారం వామపక్ష పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ 2000 ఆగస్టు 28న వామపక్ష పార్టీలు చలో హైదరాబాదు కార్యక్రమం నిర్వహించామన్నారు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తుంటే నాటి చంద్రబాబు ప్రభుత్వం విచక్షణారహితంగా ఒక వైపు గుర్రాలతో తొక్కిస్తూ మరో వైపు పోలీసుల చేత లాఠీలతో కొట్టించారని గుర్తు చేశారు. ఇది సరిపోదు అన్నట్లు పోలీసుల చేత కాల్పులు జరిపించారు. ఈ ఘటనలో కామ్రేడ్‌లు రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డిలను బలితీసుకున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు బషీర్‌బాగ్ కాల్పుల అమరవీరుల స్ఫూర్తితో మరొక పోరాటానికి సిద్ధం కావల్సి వస్తుందని హెచ్చరించారు.

మహాగణపతి.. మనసాస్మరామి

- అంతటా కొలువుదీరిన గణనాథులు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు నాయకులు

భక్తులను ఆశీర్వదించేందుకు పార్వతీ తనయుడు తరలివచ్చాడు. శోభాయమానంగా ముస్తాబైన మండపాల్లో గణనాథుడు కొలువుదీరాడు. గణేష్ మహరాజ్‌కీ జై అంటూ ఊరువాడా సందడి మొదలైంది. దీంతో ఏకదంతుడికి భక్తులు పూజలు చేస్తూ తరిస్తున్నారు. వివిధ రూపాల్లో లంబోదరుడు పూజలు అందుకుంటున్నాడు. భజనలు, భక్తి పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అంతటా సందడి వాతావరణం నెలకొంది. అలానే ఆయా ప్రాంతాల్లోని గణనాథుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీలు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కాగా ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన మండపాలు, సెట్టింగ్‌లు భక్తులను ఆకట్టుకున్నాయి. రాజంపేటలోని శివాలయం సర్కిల్‌లో కొలువైన గణనాథుడిని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి,నెట్‌వర్క్



రాజంపేట టౌన్: ప్రత్యేక అలంకరణలో వరసిద్ధి వినాయకుడు



రైల్వేకోడూరు అర్బన్: గణనాథుడికి మాజీ ఎమ్మెల్యే కొరముట్ల పూజలు



నందలూరు: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



పెనగలూరు: ఇండ్లూరు వినాయక స్వామి వద్ద కుంకుమ పూజ నిర్వహిస్తున్న మహిళలు



గాలివీడు: పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



చిట్వేలి: వైఎస్సార్ సర్కిల్ వద్ద కొలువుదీరిన వినాయకుడు



లక్కిరెడ్డిపల్లె: ఎస్‌బీఐ సమీపంలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి పూజలు



సిద్దవటం: గాంధీ వీధిలో వినాయకుని విగ్రహం వద్ద పూజలు



రాజంపేట టౌన్: వినాయకుడిని దర్శించుకుంటున్న ఆకేపాటి, పోలా



పెనగలూరు: ప్రత్యేక పూజలు చేయిస్తున్న పోలీసులు, భక్తులు



రాజంపేట టౌన్: ఎంపీపీ రమణమ్మను సత్కరిస్తున్న మహిళలు



వీరబల్లి: భక్తులకు అన్నం వడ్డిస్తున్న ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి



రాజంపేట రూరల్: అచ్చనపల్లిలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు



పుల్లంపేట: సాదువారిపల్లిలో వినాయకునికి పూజలు



చిన్నమండెం: బస్టాండు వద్ద వినాయకుడికి భక్తుల పూజలు



సంబేపల్లె: పూజలందుకుంటున్న బొజ్జ గణపయ్య